నిమజ్జన ఊరేగింపులో పాల్గొన్న మంత్రి

పాలమూరు, అక్టోబర్ 24 : దుర్గమ్మ ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో వర్ధిల్లాలని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పాలకొండలోని దుర్గామాత నిమజ్జన ఊరేగింపులో పాల్గొన్నారు. అదేవిధంగా బ్రాహ్మణవాడిలోని వాసవికన్యకాపరమేశ్వరీ ఆలయం నుంచి ప్రారంభమైన అమ్మవారి ఊరేగింపులో మంత్రి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ నరేందర్, ఆర్యవైశ్యులు, ఆలయ అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

మిడ్జిల్‌లో శమీవృక్షం వద్ద పూజలు చేస్తున్న నాయకులు

రాజాపూర్ : జమ్మి చెట్టుకు పూజలు చేస్తున్న నాయకులు

నవాబ్‌పేట : రుక్కంపల్లిలో శమీ పూజలో పాల్గొన్న గ్రామస్తులు

కనుల పండువగా దసరా

- ఆలయాల్లో శమీ పూజలు
- వైభవంగా అమ్మవారి ఊరేగింపు

జడ్చర్లటౌన్, అక్టోబర్ 24 : విజయదశమి సందర్భంగా జడ్చర్ల పట్టణ ప్రజలు ఘనంగా దసరా పండుగను జరుపుకున్నారు. పట్టణంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక శమీ పూజలను నిర్వహించారు. స్థానిక వాసవీ కన్యాకపరమేశ్వరీ ఆలయంలో శమీ వృక్షానికి ప్రత్యేక పూజలు చేశారు. వేంకటేశ్వరస్వామి ఆలయం, రేణుక ఎల్లమ్మ, సకలదేవతల ఆలయం, ఆంజనేయ స్వామి ఆలయం, శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాదేపల్లి బాలుర జెడ్పీ హైస్కూల్ మైదానంలో వీహెచ్‌పీ ఆధ్వర్యంలో శమీ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణవాసులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జమ్మి పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జమ్మిని ఒకరినొకరూ పంచుకుంటూ దసరా శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మంగళవారం జడ్చర్లలోని ఎమ్మెల్యే స్వగృహంలో జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిని కలిసి శమీ ఇచ్చి దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

జడ్చర్లటౌన్ : శమీవృక్షానికి పూజలు చేస్తున్న పట్టణవాసులు

వైభవంగా అమ్మవారి ఊరేగింపు

దసరా పండుగ నేపథ్యంలో జడ్చర్ల పట్టణంలోని మంగళవారం అమ్మవారి ఊరేగింపు వైభవంగా జరిగింది. స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పట్టణ రహదారుల మీదుగా అమ్మవారి ఊరేగింపు కొనసాగింది. భజనలు, కొలాటాలతో అమ్మవారి ఊరేగింపు కొనసాగింది. భక్తులు పెద్ద సంఖ్యలో ఊరేగింపులో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

మిడ్జిల్‌లో..

మిడ్జిల్, అక్టోబర్ 24 : మండలంలోని ఆయా గ్రామాల్లో దసరా పండుగను పురస్కరించుకొని కొత్తూర్, రాణిపేట, వాడ్యాల్, వల్లబురావుపల్లి, దోనూర్, బోయిన్‌పల్లి, భైరంపల్లి, చిల్వేర్, కొత్తూర్, కొత్తపల్లి, వేములతోపాటు ఆయా గ్రామాల ప్రజలు ఆలయాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం ఆలయాల్లో భక్తిపాటలు ఆలపిస్తూ ఊరేగింపుగా వెళ్లి జమ్మీ చెట్టుకు పూజలు నిర్వహించి ఒకరికొకరు ఆలాయ్-బలాయ్ చేసుకుంటూ పండుగ శుభాకాంక్షలను చెప్పుకున్నారు. అలాగే రావణాసుర దహనం చేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

బాలానగర్‌లో..

బాలానగర్, అక్టోబర్ 24 : విజయదశమి వేడుకలను సోమవారం మండలంలోని ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఆయా గ్రామాల్లో శమీవృక్షానికి పూజలు నిర్వహించారు. అంతకుముందు కులవృత్తిదారులు, వాహనదారులు అయుధ పూజ చేశారు. మండలంలోని మోతిఘణపూర్‌లో బీఆర్ఎస్ నాయకులు ప్రతాప్‌రెడ్డి, యాదిరెడ్డి ఆధ్వర్యంలో గ్రామ పురవీధుల గుండా ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని అక్కడ జమ్మి చెట్టుకు పూజలు నిర్వహించి ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపారు.

రాజాపూర్‌లో..

రాజాపూర్, అక్టోబర్ 24 : మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో సోమవారం దసరా వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ప్రజలు పలు దేవాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే వాహనాలకు పూజలు చేశారు. సాయంత్రం జమ్మి చెట్టుకు పూజలు నిర్వహించి ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ పట్ల ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ సుశీల, జెడ్పీటీసీ మోహన్‌నాయక్, సర్పంచులు సంఘం మండలాధ్యక్షుడు బచ్చిరెడ్డి, వైస్ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, ఎంపీటీసీ అభిమాన్యురెడ్డి పాల్గొన్నారు.

నవాబ్‌పేటలో..

నవాబ్‌పేట, అక్టోబర్ 24 : మండలంలోని ఆయా గ్రామాల్లో సోమ, మంగళవారాల్లో విజయదశమి(దసరా) పర్వదినాన్ని ప్రజలు భక్తిశ్రద్ధలతో, సాంప్రదాయరీతిలో జరుపుకొన్నారు. సోమవారం ఆయా గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు భారీ ర్యాలీలు నిర్వహించి, హనుమాన్ ఆలయాల వద్ద శమీ పూజ నిర్వహించి ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అలాగే మంగళవారం పిండి వంటలు, చేసుకొని పండుగ జరుపుకొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అనంతయ్య, జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ నర్సింహులు, మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మయ్య, సర్పంచులు గోపాల్‌గౌడ్, సౌజన్య, రఘు, కృష్ణయ్య, సత్యం, యాదయ్య, లలితమ్మ, జంగయ్య, లక్ష్మమ్మ, మాజీ ఎంపీపీ శీనయ్య, నాయకులు పాల్గొన్నారు.

నదికి హారతి ఇస్తున్న అర్చకులు

జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వరస్వామివార్లకు చక్రసాన్నం చేయిస్తున్న అర్చకులు

ఆధ్యాత్మిక పరిమళం

- జలవిహారం చేసిన ఆది దంపతులు
- ముగిసిన నవరాత్రి ఉత్సవాలు
- పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి

అలంపూర్, అక్టోబర్ 24 : దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా త్రినేత్రికి తుంగభద్రానదిలో అంగరంగ వైభవంగా తెప్పోత్సవం నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఆలయ సమీపంలోని నదిలో ఆదిదంపతులు హంస వాహనంపై జల విహారం (తెప్పోత్సవం) చేయగా నదీమతల్లి పులకించింది. దసరా పండుగను పురస్కరించుకొని ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం మహా పూర్ణాహుతి, సాయంత్రం శమీపూజ, మొదలగు కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం తుంగభద్రానదిలో ఆది దంపతులైన జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వరస్వామి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన తెప్పపై (హంస వాహనం)నదిలో జల విహారం చేశారు. ఈ కార్యక్రమాన్ని చూడడానికి అలంపూర్ సివిల్ జడ్జి కమలాపురం కవిత, భక్తులు అశేషంగా తరలొచ్చారు. ఉత్సవాల ముగింపు రోజున జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వాముల ఉత్సవమూర్తులకు ఆలయ సమీపంలో నాగకన్యల బావిలో చక్రస్నానం చేయించారు. తెప్పోత్సవం ముగిసిన వెంటనే నదీ తీరంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రాంతంలో అర్చకులు నదీ హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కుంభహారతి, రథహారతి, నక్షత్ర హారతి, దశవిధ హారతులను నదీమ తల్లికి సమర్పించారు. నదికి హారతి ఇవ్వడం అంటే సకల దేవతలను ఏక కాలంలో స్మరించిట్లేనని పండితులు పేర్కొన్నారు. అనంతరం నిర్వహించిన చిన్నారుల నృత్య కార్యక్రమాలు అలరించాయి. ఉత్సవాలను వైభవంగా నిర్వహించిన ఆయా శాఖల అధికారులు, కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఎస్పీ రితిరాజ్‌కు దేవస్థానం తరపున ఆలయ పాలక మండలి చైర్మన్ చిన్నకృష్ణయ్యనాయుడు, ఈవో పురేందర్‌కుమార్ కృతజ్ఞతలు తెలియజేశారు. డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ రాజు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

జోగుళాంబ సన్నిధిలో ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి

జోగుళాంబ సన్నిధిలో ఎమ్మెల్సీ చల్లా

ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి మంగళవారం ఉదయం అలంపూర్ ఆలయాలను దర్శించుకున్నారు. వారికి ఆ లయ పాలక మండలి చైర్మన్ చిన్న కృష్ణయ్యనాయుడు, ఈవో పురేందర్‌కుమార్ అర్చకులతో కలిసి స్వాగతం పలికారు. వారి వెంట స్థానిక బీఆర్ఎస్ నాయకులు విజయుడు, నరేందర్‌రెడ్డి తదితరులున్నారు.

క్రికెట్ టోర్నీ విజేత 'తీగల్‌పల్లి'

విజేత జట్టుకు బహుమతులు అందజేస్తున్న నాయకులు

నవాబ్‌పేట, అక్టోబర్ 24 : మండలంలోని తీగల్‌పల్లిలో మూడు రోజులుగా గడ్డం జకరయ్య, రూతమ్మ స్మారకార్థం నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో అదే గ్రామానికి చెందిన జట్టు విజేతగా నిలిచింది. ఈ టోర్నీలో 13 జట్లు పాల్గొనగా ఫైనల్లో తీగల్‌పల్లి, ఉదండాపూర్ జట్లు తలపడ్డాయి. హోరాహోరీగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో తీగల్‌పల్లి జట్టు విజేతగా నిలిచింది. గెలుపొందిన జట్లకు గ్రామ ప్రజాప్రతినిధులు, టోర్నీ నిర్వాహకులు రూ.5వేల ప్రైజ్ మనీ, ట్రోఫీ, ద్వితీయ స్థానంలో నిలిచిన ఉదండాపూర్ జట్టుకు రూ.3వేల నగదు, ట్రోఫీ అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జంగయ్య, మాజీ వైస్ఎంపీపీ నారాయణ, మాజీ సర్పంచ్ బాలకిష్టయ్య, నాయకులు నారాయణ గౌడ్, చెన్నయ్య, డేవిడ్ పాల్గొన్నారు.

నేడు ఎదిరలో నాటక ప్రదర్శన

పాలమూరు, అక్టోబర్ 24 : మహబూబ్‌నగర్ 4వ వార్డు ఎదిరలో బుధవారం రాత్రి 8:30గంటలకు ఆదిచింతల మునిరంగస్వామి నాటక కమిటీ ఆధ్వర్యంలో నాటక ప్రదర్శన నిర్వహించనున్నట్లు పంతులు కుమ్మరి నారాయణ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఈ నాటక ప్రదర్శన ప్రారంభోత్సవానికి మంత్రి శ్రీనివాస్‌గౌడ్ హాజరుకానున్నారు. ఈ నాటక ప్రదర్శన ముడురోజులపాటు ఆదిచింతల మునిరంగస్వామి వారి కాల చరిత్రను ప్రజలకు ప్రదర్శించనున్నట్లు పేర్కొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం

కోయిలకొండ, అక్టోబర్ 24 : మండలంలోని బూర్గుపల్లిలో విద్యుదాఘాతంతో వడ్డె చెన్నయ్య ఇల్లు సోమవారం దగ్ధమైంది. ఈ ఘటనపై తాసీల్దార్ భరత్‌గౌడ్ మంగళవారం దగ్ధమైన చెన్నయ్య ఇంటిని పరిశీలించారు. ఇంటిలో ఉన్న సమాగ్రి పూర్తిగా కాలిపోవడంతో రూ.18వేలు, భూమి పాస్ పుస్తకాలు మొత్తం కాలిపోవడం జరిగిందని తెలిపారు. ఈ ఘటనపై కలెక్టర్‌కు నివేదిక అందించి బాధిత కుటుంబాన్ని ఆదుకొంటామని తాసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ బురాన్ పాల్గొన్నారు.